‘రియల్’ మోసాలకు చెక్

- అక్రమ లేఅవుట్లకు బ్రేకులు
- ఎల్‌పీ నంబర్ ఉన్న వెంచర్లే రిజిస్ట్రేషన్
- భూమి శిస్తు, వీఎల్‌టీ రశీదులు ఉండాల్సిందే


ఎమ్మిగనూరు శివారులో అక్రమ లేవుట్

ఎమ్మిగనూరు: రాజకీయ పైరవీకారుల కాసుల కక్కుర్తి. అధికారుల ఆమ్యామ్యాలతో కొనసాగుతున్న రియల్ మోసాలకు ఇక కాలం చెల్లుతోంది. అనుమతుల్లేని వెంచర్లు, ఆస్తి పన్ను, భూమి శిస్తులు చెల్లించని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు జరపరాదంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మార్చి 30న ఉత్తర్వులు జారీ చేయటంతో అక్రమ లేఅవుట్లతో కొనసాగుతున్న రియల్ దందాకు బ్రేకులు పడ్డాయి. నిబంధనలు పాటించని సబ్ రిజిస్ట్రార్లనే అందుకు బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకొంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొనటంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రియల్ మోసాలకు ఉద్యోగులు, సామాన్యులు బలవుతూనే ఉన్నారు. పట్టణంలోని మైనార్టీ కాలనీ, మునెప్ప నగర్, ముగతిపేట, గుడేకల్ రోడ్డు, కలుగొట్ల రోడ్డు, కర్నూలు రోడ్డు, కోసిగిరోడ్డు, ఆదోని రోడ్లలో వ్యవసాయ భూముల్లో రాళ్లు పాతి రియల్ పంట పండిస్తున్నారు. అదనపు ఎస్‌ఎస్ ట్యాంక్‌కు సేకరించిన గుడేకల్ భూములకు కోర్టు ఉత్తర్వులతో విముక్తి లభించటంతో రియల్ దందాకు ఆ భూములే అడ్డాగా మారాయి. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోనే కాకుండా కలుగొట్ల పంచాయతీ, కడిమెట్ల, గుడేకల్, గోనెగండ్ల, నందవరం, ముగతి, హనుమాపురం, మురవణి రెవెన్యూ పంచాయతీల పరిధిలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. వ్యవసాయ భూముల్లో ఎలాంటి అనుమతుల్లేకుండా వెలసిన అక్రమ లే అవుట్లే 250కుపైగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారంటే రియల్ దందా ఏ మేర కొనసాగుతుందో తేటతెల్లమవుతోంది.

నిబంధనలకు నీళ్లు

వ్యవసాయ భూముల్లో లేఅవుట్లను వేసేందుకు అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వ్యవసాయ భూములను ముందుగా వ్యవసాయేతర భూములుగా మార్చాల్సి ఉంది. అందుకు సర్వేయర్, తహసీల్దార్ మొదలు డివిజనల్ సర్వేయర్, ఆర్డీఓ స్థాయిలో తనిఖీలు నిర్వహించాలి. వ్యవసాయేతర భూములను పట్టణ స్థాయిలో మున్సిపల్ అధికారులు, పంచాయితీ స్థాయిలో కుడా అధికారులు లే అవుట్ అప్రూవల్ ఇవ్వాలి. అలా చేయని వెంచర్లకు, రియల్టర్లపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ కాసుల కక్కుర్తిలో అటు కుడా అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు జీ హుజూర్ అనడంతో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి.

కొత్త నిబంధనలతో జలక్

రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ ఉత్తర్వులతో రియల్ అక్రమాలకు బ్రేకులు పడనున్నాయి. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకొంటున్నట్లు అందులో పొందుపర్చారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఇప్పుడున్న నిబంధనలతోపాటు రెవెన్యూ శిస్తు చెల్లింపు రశీదును ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తేనే డాక్యుమెంట్ అప్‌లోడ్ అవుతోంది. అదే పట్టణ ప్రాంతంలో ఉన్న స్థలాల రిజిస్ట్రేషన్లకు మున్సిపల్ అసెస్మెంట్ నెంబర్లుగానీ, వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ టాక్స్) రసీదులను అప్‌లోడ్ చేస్తేనే రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ అవుతుంది. లే అవుట్ల స్థలాలకు ఎల్‌పీ నంబర్ కచ్చితంగా ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేయాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్‌లు, కుడా అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఉత్తర్వుల అమలుకు సమష్టిగా కృషి చేస్తే అక్రమ వెంచర్లు, రియల్ మోసాలను అరికట్టవచ్చు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఇకపై ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు చేపడతాం. గ్రామీణ ప్రాంతంలో ఉన్న రైతులు, సామాన్యుల్లో ప్రభుత్వ నిబంధనలపై అవగాహన పెంచేందుకు సచివాలయ స్థాయిలో చర్యలు చేపడతాం. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎల్‌పీ నంబర్‌తోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చర్యలు చేపడతాం.

– రామదాస్, ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్

ఉత్సవాలు ప్రారంభం


శంకరబండలో పూజలందుకుంటున్న లింగమేశ్వర స్వామి

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో సోమవారం లింగమేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, అభిషేకం, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం పదవ తరగతి పరీక్ష రాసి బయటికి వచ్చిన విద్యార్థులకు పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్ విభాగానికి చెందిన 60 మంది విద్యార్థినులు మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సొంతంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం గౌసియాబేగం, గైడ్ కెప్టెన్ సుజనకుమారి, ఎంటీ మహాలక్ష్మిదేవి తెలిపారు. మండు వేసవి దృష్ట్యా మజ్జిగ, మంచి నీరు విద్యార్థులకు అందించడం పట్ల పరీక్షలను తనిఖీ చేసిన అధికారి శివరామసాగర్ స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థినులను అభినందించారు.

నమ్మకానికి నిదర్శనం సీఎం జగన్


జగనన్న స్టిక్కర్‌ను చూపుతున్న కుమ్మరి సుంకులమ్మ


ఎమ్మిగనూరు 28వ వార్డులో చేనేత కార్మికురాలితో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్


టీఎస్ కూళ్లూరులో తన ఇంటికి అతికించిన సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను శుభ్రం చేస్తున్న తిమ్మక్క

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మకానికి నిదర్శనమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఉద్ఘాటించారు. సోమవారం నందవరంలో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమానికి ఆయన హాజరై గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు–సంక్షేమ పథకాలు అమలు చేసి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగా లంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. చంద్రబాబును నమ్మి మోసపోవద్దని సూచించారు.

జగనన్నే మా నమ్మకం

మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి స్థానిక కుమ్మరి వీధిలో సుంకులమ్మ అనే మహిళతో సంక్షేమ లబ్ధిపై ఆరా తీశారు. తమ కుటుంబానికి వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మ ఒడి, పంటల బీమా, తదితర పథ కాల ద్వారా మూడున్నరేళ్లలో దాదాపు రూ.6 లక్షలు లబ్ధి చేకూరినట్లు ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ఇలాంటి పథకాలు కొనసాగితేనే తమ జీవితాలు బాగుపడుతాయని, జగనన్నకు అండగా నిలుస్తామని తేల్చిచెప్పింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ, సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, సర్పంచ్ తోట సావిత్రి, ముగతి సర్పంచ్ వీరుపాక్షి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచిచేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

ఎమ్మిగనూరుటౌన్: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక 28వ వార్డు పరిధిలోని వెంకటాపురం కాలనీలో వార్డు సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లతో కలిసి చేనేత కుంటుబాలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వారి మొబైల్‌ఫోన్‌కు, ఇంటి గోడకు స్టిక్కర్లు అతికించి టోల్‌ఫ్రీ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇప్పించారు.

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మికాంతరెడ్డి, సోసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు ఇంటింటికీ తిరుగుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల స్పందనను నమోదు చేసుకుని ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు.

హొళగుంద: కోగిలతోట, లింగంపల్లి, బీజీహళ్లి, హొళగుంద, నెరణికి, గజ్జహళ్లి, వందవాగిలి తదితర గ్రామాలలో ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నాలుగవ రోజు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి తిరిగారు. సీఎం జగన్ పాలన గురించి ఆరా తీసి టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల పాలనలో తేడాను వివరించారు. ప్రజల అభిప్రాయం తీసుకుని ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాలలో ఎంపీపీ అనిత, సర్పంచ్ మల్లికార్జున, ఉపసర్పంచ్ ఆముదాల గోపాల్, సచివాలయాల కన్వీనర్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు శ్రీనివాసులు, తాలూరు వెకంటేశ్వర్రెడ్డి, కృష్ణ, బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని గ్రామాల్లో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమంలో భాగంగా కన్వీనర్లు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. గత టీడీపీ పాలనలో కష్టాలు, ప్రస్తుత ప్రభుత్వ జనరంజక పాలన గురించి వివరిస్తున్నారు. టీఎస్ కూళ్లూరు గ్రామంలో తన ఇంటికి అతికించిన సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్‌ను వృద్ధురాలు తిమ్మక్క తన చీర కొంగుతో తుడిచి నా మనవడు అంటూ సంబరపడిపోయింది.

వందేళ్లు వర్ధిల్లు నాయనా..


టి.గోకులపాడులో తన ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికించుకుంటున్న వృద్ధ ప్రమీలమ్మ

కృష్ణగిరి: పాలనలో తండ్రికి మించిన తనయుడిగా ముద్ర వేసుకున్నావ్.. మాలాంటి పేదలకు అండగా నిలిచావు.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న నాయకులను నా జీవితంలో నిన్నే చూస్తున్నా.. వందేళ్లు వర్ధిల్లు నాయనా అంటూ కృష్ణగిరి మండలం టి.గోకులపాడుకు చెందిన వృద్ధ ప్రమీలమ్మ సీఎం జగనన్న ఫొటోను చూసి మురిసిపోయింది. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా తన ఇంటికి వచ్చిన సచివాలయ కన్వీనర్, గృహసారథుల నుంచి స్టిక్కర్ తీసుకుని స్వయంగా ఇంటి గోడకు అతికించుకుంది. తనకు వితంతు పింఛన్‌తోపాటు రైతు భరోసా సాయం వస్తుందని, అవినీతి, పక్షపాతానికి తావు లేకుండా పథకాలు అందించడంలో నా మనువడు సీఎం వైఎస్ జగన్‌కు ఎవ్వరూ సాటి లేరని పేర్కొంది.

ఆస్పరి: డీ.కోటకొండ గ్రామంలో ఓ వృద్ధురాలు గృహసారథుల నుంచి జగనన్న స్టిక్కర్ ఇప్పించుకుని తానే స్వయంగా ఇంటి గోడకు అతికించుకుంది. తమలాంటి వృద్ధులకు సీఎం జగన్ కనిపించే దేవుడని, ప్రతినెలా 1వ తేదీన ఇంటి వద్దకే పింఛను సొమ్ము పంపుతున్నాడని పేర్కొంది.

పట్టణాభివృద్ధే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాభివృద్ధే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శివన్న నగర్‌లో నాయీ బ్రాహ్మణ కాలనీలో గ్రావెల్ రోడ్డుకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటికే 14 వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులను పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం శిల్పా ఎస్టేట్ నుంచి మిలటరీ కాలనీ మీదుగా వెంకటాపురం, లక్ష్మణ్ థియేటర్ నుంచి ఎస్ఎస్ ట్యాంక్ వరకు,సోగనూరు ప్రధాన రహదారులకు బీటీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. మైనారిటీ కాలనీ తదితర శివారు ప్రాంతాలకు త్వరలోనే రోడ్ల నిర్మాణా లు చేపడతామన్నారు. వార్డు కౌన్సిలర్ అమానుల్లా, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిలర్లు శివప్రసాద్, డిష్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగలదిన్నె బ్రిడ్జి పరిశీలన

నందవరం: ఆంధ్ర– తెలంగాణ సరిహద్దులను కలుపుతూ నిర్మించిన నాగలదిన్నె వంతెనను కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం నాగలదిన్నెలోని బ్రిడ్జి పనులు, ఆంధ్ర, తెలంగాణ వైపు అప్రోచ్ పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తి కావడంతో రాకపోకలకు మార్గం సుగమమైందన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో స్థల వివాదం ఉండేదని, తెలంగాణ రాష్ట్రం అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంతో మాట్లా డి అప్రోచ్ రోడ్డు పనులు చేయించామన్నారు. ఆంధ్ర, తెలంగాణ వైపు అప్రోచ్ రోడ్డు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నాయకులు పార్థసారథిరెడ్డి తదితరులు వెంట ఉన్నారు.

క్‌ను వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సాదరంగా ఆహ్వానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో భూసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కి సోమవారం రాత్రి టీబీ బోర్డు అధికారులు నీటి సరఫరా నిలిపివేశారు. టీబీ డ్యాంలో నీటిమట్టం అడుగంటుతుండడంతో రాత్రి నుంచి నీటి మట్టాన్ని తగ్గిస్తూ మంగళవారం ఉదయానికి పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎల్లెల్సీలో ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద మరో వారం రోజుల పాటు కాలువలో చిన్నగా ప్రవాహం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 447 క్యూసెక్కులు నీటి ప్రవాహముంది.

టీబీ డ్యాంలో నీటి నిల్వలు

టీబీ డ్యాంలో సోమవారం 1578.05 అడుగులతో 3.593 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఈ 11.898 టీఎంసీల నీరు నిల్వ ఉండేది.

బాధ్యతల స్వీకరణ

ఆలూరు: దేవనకొండ మండల తహసీల్దార్‌గా వెంకటేష్‌నాయక్‌ను నియమిస్తూ జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను దేవనకొండకు కేటాయించారు. దీంతో ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుదర్శనం తిరిగి డీటీ బాధ్యతలు అందుకోనున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ వెంకటేష్‌నాయ

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కృష్ణగిరి: రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండాపురం ఎర్ర చిన్నమద్ది (88) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గత 45 ఏళ్లుగా కోట్ల, చెరుకులపాడు కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్ రెడ్డి గ్రామానికి చెరుకుని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయకులు పోతురెడ్డి, కాటుమాన్ సుభాష్, శ్రీరాములు, చిన్న ఎల్లయ్య తదితరులు నివాళులర్పించారు.

గురుకులం ఉద్యోగినికి గాయాలు

వెల్దుర్తి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం ఉద్యోగిని రామలక్ష్మి సోమవారం బైక్ నుంచి కింద పడి గాయాలపాలైంది. తన విధి నిర్వహణ అనంతరం డోన్‌కు బయల్దేరేందుకు గురుకులం నుంచి వెల్దుర్తి పాతబస్టాండుకు వెళ్లే బైక్‌ను లిఫ్ట్ అడిగి ఎక్కింది. మధ్యలో అకస్మాత్తుగా కుక్కలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడింది. బైకిస్టు క్షేమంగా బయటపడగా రామలక్ష్మి తలకు గాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందిన అనంతరం డోన్‌కు బయలుదేరి వెళ్లింది.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మినారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఏంఈఓ మస్తాన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ రాంనీలా, ఈఓపీఆర్డీ సంజన్న, ఏఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు


జొన్నగిరిలో గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం జొన్నగిరిలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు ఏపీ పథకాల ద్వారా ఎంత మొత్తం లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రభుత్వ పథకాలు అందాయా?, సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు వెన్నుదన్నుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు..భరోసా

సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన జనం జగనన్నే మా భవిష్యత్తు..మాకు భరోసా అని చెబుతున్నారని ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ స్టిక్కర్ అతికించి కరపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో చేసిన మోసాలు, తమ ప్రభుత్వం నేరుగా ఇంటివద్దకే పథకాల అందిస్తున్న తీరును వివరించి మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందామని మళ్లీ సీఎంగా జగనన్ననే గెలిపించుకుంటామనిగ్రామస్తులు ముక్తకంఠంతో చెప్పారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, హనుమంతు, మోహన్‌రెడ్డి, నాగప్ప, దేవి, రఘు, విజయభాస్కరరెడ్డి, సోమశేఖరరెడ్డి, పక్కీరప్ప, సుంకప్ప, తేరప్ప, దివాకర్ పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఆలూరు రూరల్: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఆలూరు సర్కిల్‌లోని 4 మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 85 వాహనాలను హాలహర్వి పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐ ఈశ్వరయ్య సమక్షంలో వేలం నిర్వహించారు. ఇందులో 65 వాహనాలను వేలం దారులు దక్కించుకున్నారు. 65 వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.4,18,300 కాగా 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.6,70,800 ఆదాయం వచ్చినట్లు ఆలూరు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ చెప్పారు.

ముళ్లకంపల తొలగింపు

కృష్ణగిరి: గ్రామస్తులు అడిగిన సమస్యకు తక్షణమే పరిష్కారం చూపి శభాష్ అనిపించుకున్నారు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి. మండల పరిధిలోని తాపలకొత్తూరు నుంచి డోన్ మండలం మల్లెంపల్లె వెళ్లే ప్రధాన రహదారి ముళ్ల కంపలతో నిండిపోవడంతో గ్రామస్తులు డోన్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఎంపీపీ, జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లకంపలను తొలిగించారు. దీంతో గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యువకుడి ఆత్మహత్య

చిప్పగిరి: కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామదుర్గం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని రామదుర్గం గ్రామానికి చెందిన బునాదుల ఉసేని, లక్ష్మిదేవి దంపతుల కుమారుడు ముత్యాల నాయుడు (22) గత కొంత కాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలో హంద్రీ–నీవా బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆస్పరి మండలం శంకరబండకు చెందిన బోయ మండగిరి వెంకటేష్ (23) తీవ్ర గాయాలపాలయ్యాడు. పని నిమిత్తం పత్తికొండకు వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో వెంకటేష్ తలపగిలి, చెవి నుంచి తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోడుమూరు రూరల్: బైక్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కోడుమూరు– కర్నూలు రహదారిలో కొత్తూరు గ్రామ సమీపంలో ఈ దుర్ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆస్పరి మండలంలోని హరిగెర గ్రామానికి చెందిన వీరన్న కుమారుడు శ్రీనివాసులు(37) హైదరాబాద్‌లో పని చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన శ్రీనివాసులు తిరిగి హైదరాబాద్‌కు బైక్‌పై వెళుతుండగా కొత్తూరు సమీపంలో కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను కోడుమూరు సీఐ శ్రీధర్ తన సిబ్బందితో కలిసి పట్టణంలో అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆలూరు: హాలహర్వి మండలం బాపురం గ్రామంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాయలసీమ జిల్లాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మినారాయణ, చిన్నహ్యాట శేషగిరి మాట్లాడుతూ.. రాజ్యాంగ కల్పనలో అంబేడ్కర్ కృషిని వివరించారు. నాయకులు స్వామిదాస్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.70 వేలు విరాళం


విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నర్సింగ్ అశోక్‌కుమార్ రెడ్డి

వెల్దుర్తి: బోయనపల్లె గ్రామంలో దళితుల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ స్థాపనకు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ కుమారుడు నర్సింగ్ అశోక్‌కుమార్ రెడ్డి సోమవారం రూ.70 వేల విరాళం అందించాడు. నాయకుడి ఉదారతపై విరాళం చెక్కు అందుకున్న వారు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

312 మందికి ఈబీసీ నేస్తం

తుగ్గలి: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈబీసీ నేస్తం పథకం కింద మండలంలో 312 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా సోమవారం తెలిపారు.ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈనెల 12న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారన్నారు.

పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు


నందవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌజన్యలత, వైద్య సిబ్బంది

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పల్లెల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ సౌజన్యలత అన్నారు. సోమవారం నందవరంలోని సచివాలయం–1 ఆవరణలో వృద్ధులు, గర్భిణులు, బాలింతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. బాలింతులు చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు.గర్భిణులు నెలవారి సూదులు వేయించుకోవాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, ఏఎన్ఎం దేవిప్రియ, హెల్త్ అసిస్టెంట్, రమేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక స్థల ఆక్రమణను అడ్డుకొని ప్రహరీ నిర్మించాలని కమిటీ సభ్యులు గణేష్, బతకన్న, నారాయణ, ఈరన్న, దేవదానం తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జయన్న, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డిలకు వినతిపత్రాలు ఇచ్చారు. శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి ప్రహరీ నిర్మించాలని కోరారు.

11 మంది గైర్హాజరు

వెల్దుర్తి: మండల కేంద్రంలో బాలుర, బాలికల జెడ్పీ హైస్కూళ్లు, ఎస్సీ గురుకులంలోని రెండు సెంటర్లలో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. 927 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయన్నారు.

అన్ని పాఠశాలల్లో బెంచీల ఏర్పాటు


వెల్దుర్తి కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న అలెస్కో, ఐఈఆర్‌టీ కో–ఆర్డినేటర్లు

వెల్దుర్తి: అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బెంచీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు అలెస్కో, ఐఈఆర్‌టీ జిల్లా కో–ఆర్డినేటర్లు శ్రీనివాసులు, విజయప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో విచారించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఇంకా కావలసిన డెస్కుల వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన వాటి నివేదికలు పంపాలని ఎంఈఓ ఇందిరను కోరారు. అనంతరం స్థానిక కేజీబీవీని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసి అక్కడ అవసరమైన డెస్కుల వివరాలు ఎస్‌ఓ షాకీరాబేగంను అడిగి తెలుసుకున్నారు. తమ నివేదికలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

పన్నులు చెల్లించండి

మద్దికెర: మేజర్ పంచాయతీ ప్రజలు సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ సుహాసిని,ఈఓ శ్రీహరి కోరారు. వారు సోమవారం సిబ్బందితో సమావే శం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పన్నులు సకాలంలో చెల్లిస్తే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలవుతుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా సత్వర చర్యలు చేపట్టేందుకు అవసరమన్నారు. ప్రజలు పంచాయతీ సిబ్బందికి పన్ను చెల్లించి రశీదు పొందాలని సూచించారు.